క్లుప్తంగా

ప్రభుత్వ డైట్ కళాశాలకు సౌండ్ సిస్టం బహూకరణ



విద్యారణ్యపురి: హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలలోని 1998 – 1999 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.15 వేల విలువగల సౌండ్ సిస్టంను కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సోమయ్యకు ఆదివారం బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భిక్షపతి, బాబురావు, రవికిరణ్, శ్రీధర్, వేణుమాధవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మానవులంతా సమానమే

కాజీపేట రూరల్: సమాజంలోని మానవులంతా సమానమేనని బెంగళూరు యునైటెడ్ థియోలాజికల్ కాలేజ్ (యూటీసీ) ప్రొఫెసర్ బేతేల్ కృప అన్నారు. కాజీపేట వెంకటాద్రినగర్‌లోని సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి 24వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మానవతా దృక్పథాన్ని పెంపొందించుకొని, ఇతరులపై ప్రేమ, దయతో ఉండాలని సూచించారు. సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి ఇన్‌చార్జ్ రెవరెండ్ డాక్టర్ కే.పీటర్స్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కాజీపేట సీఎస్ఐ చర్చి నుంచి రెవరెండ్ డాక్టర్ విక్టర్ పాల్, చర్చి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మిద్దెతోట గ్రూపు సభ్యుల సమావేశం



హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లా మిద్దెతోట గ్రూపు సభ్యుల సమావేశం హనుమకొండలోని అక్షరకాలనీలో ఆదివారం జరిగింది. గ్రూపు నిర్వాహకుడు ఇమ్మడిశెట్టి ప్రభాకర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మిద్దెతోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలు, వర్షాకాలంలో సాగు చేసే పద్ధతులు వంటి విషయాలపై చర్చించారు. 25మంది గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 40వ డివిజన్‌కు చెందిన పలువురు యువకులు దాసి రాందేవ్ ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ డిక్లరేషన్ ద్వారా యువతకు పెద్దపీట వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్, అయూబ్, అనిల్, ప్రభాకర్, శ్రీలత, లింగన్న, రవి, సుభాష్‌గౌడ్, దినేష్, వరుణ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్డులోని ఆర్ఆర్‌గార్డెన్‌లో 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఈమేరకు పలు పార్టీల నాయకులు, కార్యకర్తలకు కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆహ్వానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ, కుడా మాజీ డైరెక్టర్ మోడెం ప్రవీణ్, ఈదుల రమేష్, శంకేసి లింగమూర్తి, భిక్షపతి, రవి, సుధాకర్, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నయీంనగర్ / రాముడు పేట: తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా గుండెబోయిన మహేష్‌యాదవ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు సాదం బాలరాజు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మహేష్‌కు ఆదివారం నియామక ఉత్తర్వులు అందించారు.

త్రిపుల్ ఎస్ కాంప్లెక్స్‌లో అంధకారం

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో ఉన్న త్రిపుల్ ఎస్ కాంప్లెక్స్‌లో గత ఐదు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. మునుపెన్నడు లేని రీతిలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు వరద నీటితో కాంప్లెక్స్ పూర్తిగా నిండిపోయింది. దాంతో కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న విద్యుత్తు మీటర్లు పూర్తిగా నీటమునిగిపోవడంతో కరెంట్ సరఫరాలో అంతరాయం కలిగింది. సంబంధిత అధికారులు మరమ్మతు పనులను సకాలంలో చేపట్టకపోవడంతో వ్యాపారాలు అటకెక్కాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 30కి పైగా వ్యాపార సంస్థలు పగలు మాత్రమే నడుస్తూ రాత్రి వేళల్లో మూసి వేస్తున్నట్లు వాపోయారు. దాంతో నష్టం వస్తోందన్నారు. అధికారులు స్పందించి కరెంట్ సరఫరాను పునరుద్ధరించాలని వారు కోరుతున్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న రైల్వే పోలీసులు, చైల్డ్‌లైన్, ఎన్జీఓ ప్రతినిధులు



అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్, బచ్‌పన్ బచావో, పోలీసులు, చైల్డ్‌లైన్, ఎన్‌జీవోలు, తదితరులు

కాజీపేట రూరల్: సమాజంలో బాల బాలికల అక్రమ రవాణాను అరికట్టి, వారి హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ ఎం.సంజీవరావు సూచించారు. అగైనిస్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్ అవేర్‌నెస్ వరల్డ్ డేను పురస్కరించుకొని ఆర్పీఎఫ్, జీఆర్పీ, చైల్డ్‌లైన్ –1098, ఎన్జీఓ ఆధ్వర్యంలో కాజీపేట జంక్షన్‌లో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, బాలబాలికలు చదువుకునేలా తామందరం కృషి చేయాలని సూచించారు. అనంతరం, కాజీపేట జంక్షన్‌కు చేరుకున్న ధానాపూర్, గోల్కొండ, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని ప్రయాణికులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఆర్పీఎఫ్ ఏఎస్సై జావెద్, సుమలత, శ్రీలత, కృష్ణమూర్తి, ప్రవీణ్, శ్రుతి, రవి, చైల్డ్‌లైన్, సీడబ్ల్యూసీ ప్రతినిధులు అనిల్‌చందర్, సంతోష్, దామోదర్, ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కాశిబుగ్గ: మానవ అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని వరంగల్ ఆర్పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ స్టేషన్‌లో బచ్‌పన్ బచావో ఆందోళన్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీస్, చైల్డ్‌లైన్, ఎన్‌జీవోస్, ఆదర్శ కళాశాల విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపించాలని సూచించారు. బాలికలు, మహిళలపై దాడులు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



కాశిబుగ్గ: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాస్టర్, తదితరులు

కాశిబుగ్గ: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు ఆపాలని డిమాండ్ చేస్తూ బెతెస్త బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. 19వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లోని బెతెస్త బాప్టిస్ట్ చర్చిలో ప్రార్థనల అనంతరం చర్చి నుంచి వెంకట్రామ జంక్షన్ మీదుగా కాశిబుగ్గ జంక్షన్ వరకు క్రైస్తవులు నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో పాస్టర్ పోలెపాక కరుణ్ శ్రావణ్, పోలెపాక సీతయ్య, జయాధర్, ప్రసాద్, రాజు, చంటి, ప్రవీణ్, యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీలో ఐక్యత చాటుదాం

కాజీపేట అర్బన్: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న మారణహోమానికి నిరసనగా సోమవారం చేపటనున్న శాంతి ర్యాలీలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని తమ ఐక్యతను చాటాలని కల్వరి ప్రేమ ప్రార్థన మందిరం పాస్టర్ బొందుగుల కరుణాకర్ తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండలోని రాజీవ్‌గృహకల్ప సముదాయంలోని ప్రార్థన మందిరంలో శాంతి ర్యాలీ వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు.

నేడు 'చలో కలెక్టరేట్'

హసన్‌పర్తి: తమ సమస్యలు పరిష్కరించనందుకు సోమవారం చలో కలెక్టరేట్‌కు పిలుపునిచ్చినట్లు గ్రామపంచాయతీ ఉద్యోగుల జేఏసీ హనుమకొండ ఇన్‌చార్జ్ చాతళ్ల సదానందం తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మె చేపట్టి 25 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదని వాపోయారు.

నేటి నుంచి మెట్టుగుట్టపై పూజలు

మడికొండ: మెట్టుగుట్టపై సోమవారం నుంచి రెండు రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శేషు భారతి ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామచంద్ర స్వామి ఆలయంలో భగవత్పార్థన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, ప్రాశన, వాస్తుపూజ, వాస్తు హోమం, అకల్మశ హోమం, రక్ష బంధనం, దీక్షాధారణ, నీరాజనం మేదినిపూజ, అంకురార్పణ, ఉక్త హోమం, నీరాజనం, కుంభ సాధన, ఆరాధనం నిర్వహించనున్నట్లు వివరించారు.

రేపు సత్యనారాయణస్వామి వ్రతం

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు హనుమకొండ జిల్లాలోని రెడ్డి కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం, వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

మడికొండ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మడికొండ ఇన్‌స్పెక్టర్ వేణు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలని సూచించారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వాడకూడదని అన్నారు. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని చెప్పారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై దివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

మడికొండలోని మెట్టుగుట్ట ద్వారం వద్ద ఆదివారం సాయంత్రం ఇన్‌స్పెక్టర్ వేణు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సై చంద్రమౌళి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప క్రీడాకారులుగా రాణించాలి



ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: బహుజనులలో తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించేలా కృషి చేయాలని, అందుకు తమవంతు ప్రోత్సాహం అందిస్తామని బీఎస్పీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొట్ల కార్తీక్ అన్నారు. కాకతీయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో స్వేరో డిజిటల్ కమాండో (ఎస్‌డీసీ), బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆర్ఎస్పీ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ టాస్‌వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. వరంగల్, అమరకింగ్స్ జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడగా 11 పరుగుల తేడాతో వరంగల్ జట్టు విజయం సాధించింది. వచ్చే నెల 8వ తేదీన విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ సెక్రటరీ కన్నం సునీల్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొల్ల మనోహర్, ఉపాధ్యక్షుడు కట్కూరి సునీల్, జిల్లా నాయకులు చాతల వేణుగోపాల్‌రెడ్డి, మధుకర్, మ్యాచ్ నిర్వాహకులు సంతోష్, తిరుపతినాయక్, అశోక్ పాల్గొన్నారు.

7న 'చలో కలెక్టరేట్'

కాజీపేట: జిల్లాలో భారీ పరిశ్రమల ఏర్పాటుతో పాటు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 7న చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. కాజీపేట 63వ డివిజన్ ఏఆర్ఆర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి స్వామి అధ్యక్షత వహించగా జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి, శంకర్‌నాయక్, రాసమల్ల దీన, రాజమణి, బొట్టు భిక్షపతి పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దుచేస్తూ చట్టం చేయండి



కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మడికొండ: సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని పీఆర్టీయూ తెలంగాణ నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ పర్యటనకు ఆదివారం వచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య మాట్లాడుతూ లక్షలాది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్‌తో నష్టం వాటిల్లనుందని వివరించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర బాధ్యులు దావు రమేష్, అధ్యక్షుడు రావుల కార్ వెంకటేష్, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ములుగు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాంకుడోత్ జ్యోతినాయక్, తాడిచర్ల రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలి

హన్మకొండ: ఇంజనీరింగ్ సహా ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు కూడా ప్రభుత్వమే పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాసిన లేఖను హనుమకొండలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదివే బీసీ విద్యార్థులకు ఎంసెట్‌లో ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజు చెల్లించాలని కోరారు. ఈనెల 31న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కేబినెట్ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్‌తో పాటు ఇతర బీసీ మంత్రులు, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి లేఖల ద్వారా విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

రెగ్యులరైజేషన్‌పై మంత్రిమండలిలో చర్చించాలి



దీక్షలో కూర్చున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవన ఎదుట మహిళా కాంట్రాక్టు అధ్యాపకులు చేస్తున్న సమర రిలే నిరాహార దీక్షల ఆదివారం నాల్గవ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు మాట్లాడుతూ కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజేషన్‌పై రాష్ట్ర కేబినెట్‌లో చర్చించాలన్నారు. దీక్షలో కేయూ కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు, అలకంటి సునీత, భాగ్యలక్ష్మి, రాధిక, రాజేశ్వరి, రవీందర్, ఎర్రగొల్ల రాజు, వెంకటగోపీనాథ్, విద్యాసాగర్, కుండి లక్ష్మారెడ్డి, సాధు రాజేష్, మామిడి లింగయ్య, రవికుమార్ కూర్చున్నారు. శిబిరాన్ని కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సోల్తి కిరణ్, ఎడ్ల ప్రభాకర్, మహేందర్, శ్యాంసుందరాచారి, నాగేశ్వర్‌రావు సందర్శించారు.

సంక్షిప్తంగా

అవోపా ఆధ్వర్యంలో వైద్య శిబిరం

విద్యారణ్యపురి / హన్మకొండ అర్బన్: హనుమకొండలో ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో అవోపా భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్యులు రఘుపతి (డయాబెటిషియన్), నాగరాజు (దంత వైద్య నిపుణులు), డాక్టర్ సుష్మిత (కంటి వైద్య నిపుణులు) పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో అవోపా చైర్మన్ డాక్టర్ రవీందర్, ఉపాధ్యక్షుడు వల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి పుల్లయ్య, కోశాధికారి తాటికొండ సుధాకర్, బాధ్యులు శివకుమార్, సదానందం, సురేందర్, శ్రీనివాస్, రమేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు. కాగా, వైద్యులను అవోపా బాధ్యులు సన్మానించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలో వరంగల్ జిల్లా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో టైమ్స్ హాస్పిటల్ వైద్యుడు రమేష్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యుడు రాంబాబు, సిబ్బంది పూజిత, రాధిక, పుష్పక్ బాబు, సోమలక్ష్మి, బొల్ల కార్తీక్, శ్యామ్, రజిత పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు ప్రశంసనీయం

వరంగల్ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మిత్ర బృందం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడాన్ని తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ప్రశంసించారు. వరంగల్ చౌరస్తాలో బృందం అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా హెల్త్ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం, కార్పొరేటర్లు గందె కల్పన, దిడ్డి కుమారస్వామి, వైద్యులు జ్ఞానేశ్వర్, రవీందర్, మైదం రాజు, ఆర్యవైశ్య మిత్ర బృందం ప్రతినిధులు గార్లపాటి నాగేందర్, దొడ్డ మోహన్‌రావు, అనిల్, నాగరాజు, సతీష్, సంతోష్ కుమార్, నాగరాజ్, బద్రీనాథ్, రమేష్ బాబు, కళావతి, అంజలి, ధనలక్ష్మి, జ్యోతి, శిరీష పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు సన్మానం



ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన సీఐ సురేష్‌ను సిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న, నాయకులు మురళీగౌడ్, సిద్ధం రాము ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌కు మొక్క అందజేసి సన్మానించారు. ఇటుకాల అశోక్, నాగరాజు, కుర్మిల, సంపత్, సాజిద్, అత్తర్, సిరంగి రాజు, చిలుక శ్రీధర్, అరుణ్, హుస్సేన్ పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ఖిలా వరంగల్: ముంపు ప్రాంతాల్లోని నిరాశ్రయులకు వరంగల్ రైల్వేగేట్ పెరకవాడకు చెందిన మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి నేతృత్వంలో ఆదివారం అన్నదానం చేశారు. వరద బాధితులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఖిలా వరంగల్: పరిసరాలను పరిశుభ్రం ఉంచుకుంటే రోగాలు దరిచేరవని కార్పొరేటర్లు సూచించారు. ఈమేరకు వరంగల్ 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్, పెరకవాడలో కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లోని నిల్వ ఉన్న నీళ్లను తొలగించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే, 38వ డివిజన్‌లో కార్పొరేటర్ బైరబోయిన ఉమ పర్యటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముస్కమల్ల సుధాకర్, మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్, రావుల రాజేష్, ధర్మపురి ఓం ప్రకాశ్, సందీప్, మహిళలు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా ఆగస్టు రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ విశ్వరూపం మహాసభను విజయవంతం చేయాలని మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ పల్లె ఉదయ్ పిలుపునిచ్చారు. ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో కాశిబుగ్గలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంఈఎఫ్ నాయకులు కొత్తూరి ప్రభాకర్, తోట శ్రీనివాస్, బొచ్చు ఆనంద్, అశోక్‌కుమార్, సురేందర్, అనిల్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరాలయంలో చండీహోమం

కాశిబుగ్గ: మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక కాశీ విశ్వేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున కాశీ విశ్వేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బయ్యా స్వామి, ఓరుగంటి కొమురయ్య, వైకుంఠం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహాశివుడికి ప్రత్యేక అలంకరణ

కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో మహా శివుడికి ఆదివారం ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు.

విద్యా సంస్థల్లోకి ప్రవేశం రద్దు సిగ్గుచేటు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



కేయూ క్యాంపస్: మాట్లాడుతున్న ఆజాద్

హన్మకొండ: విద్యా సంస్థల్లోకి మీడియా, విద్యార్థి సంఘాలకు ప్రవేశం రద్దు చేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన జారీ చేసిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ డిమాండ్ చేశారు. ఈమేరకు జారీ చేసిన ఆదేశాలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ కూడలిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు, మీడియాను ప్రభుత్వ పాఠశాలు, గురుకులాల్లోకి రావద్దనడం నిజంగా సిగ్గుచేటని విమర్శించారు. గురుకులాల్లో నిత్యం విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురవుతున్నారని, ఈ క్రమంలో ప్రభుత్వ లొసుగులు, అధికారుల తప్పిదాలు, అక్రమాలు ఎక్కడ బయటపడుతాయోననే భయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల చరణ్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ, సభ్యులు రాజ్‌కుమార్, పూర్ణచందర్, కే.కుమార్, భాను పాల్గొన్నారు.

విద్యార్థి వ్యతిరేక విధానాలు సరికాదు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థి సంఘాలు, మీడియా సంస్థలు వెలుగులోకి తీసుకొస్తున్నాయని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన.. పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియాను రానీయవద్దని ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆజాద్ విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం నిర్వహించిన పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగాన్ని సర్కారు పూర్తిగా సంక్షోభంలోకి నెట్టి వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, అరుణ్, సంగీత, ప్రవీణ్, అభిరామ్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు వెంటనే చేపట్టాలి



దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హసన్‌పర్తి: ముంపు ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ సూచించారు. ముంపునకు గురైన 56వ డివిజన్‌లోని ద్వారకసాయి కాలనీ, జవహర్‌కాలనీ, ఎస్‌వీఎస్ హోం, వెంకటేశ్వరకాలనీ, టీఎన్జీవోస్ కాలనీ –2 ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా బాధితులను పరామర్శించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు మణీంధర్‌నాథ్, నరెడ్ల శ్రీధర్, అటికం రవీందర్, కోఆప్షన్ మాజీ సభ్యుడు పాషా, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ చింత రమేష్ తదితరులు ఉన్నారు.

'అభయ' సేవలను మరింత విస్తరించాలి



హరితారెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పరశురాములు, శ్రీనివాస్‌రావు

హన్మకొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ – అభయ సేవలు మరింత విస్తరించాలని లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్, మాజీ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు సూచించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమకొండ – అభయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా అభయ క్లబ్ అధ్యక్షురాలు మాడుగుల హరితారెడ్డి, కార్యదర్శి వంగ వసంతరెడ్డి, కోశాధికారి బొప్పిడి జగన్ మోహన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులతో లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ పొట్లపల్లి శ్రీనివాస్‌రావు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పరశురాములు మాట్లాడుతూ అవసరార్థులకు లయన్స్ క్లబ్ ఎల్లవేళలా సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లయన్స్ సభ్యులు ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా ప్రజలకు అండగా నిలుస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రముఖులు కొత్తపల్లి జాన్ బన్నీ, డాక్టర్ కొండపల్లి సుధాకర్ రెడ్డి, త్రివేణి రెడ్డి, రఘువీరారెడ్డి, తాడూరి రేణుక, వెంకటరమణా రెడ్డి, వనం గోపాలరావు, రాంగోపాల్ రెడ్డి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1997 –98వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో విభిన్న వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశాన్ని పాఠశాలలో ఏర్పాటు చేసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, ఉపాధ్యాయులు సయ్యేదా, మమత, అన్వర్ సయ్యద్, సత్యప్రకాష్, రాజన్న, నర్సయ్య, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.